మోడీ నాలుగేళ్ళ దుష్పరిపాలన

# రాజ్యాంగ ం
# ధిక్కారం
# నిర్వీర్యం
# నాశనం

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042

**ప్రథమ ముద్రణ** : జూన్, 2018

వెల : ₹ 15/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

135311

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ❖ | ముందుమాట | 5 |
| ❖ | భారత రాజ్యాంగంపై దాడి | 10 |
| ❖ | సంఘ్ స్వాధీనంలో | 15 |
| ❖ | సమాఖ్య స్ఫూర్తికే విఘాతం | 20 |
| ❖ | కల్లోల కాశ్మీరం – మోడీ విధానం | 24 |
| ❖ | అమెరికాకు గులాంగిరి | 29 |

# ముందు మాట

**ఈ** ప్రచురణలో మోడీ పాలనకు సంబంధించిన నాలుగు అంశాలను విడివిడిగా ముద్రిస్తున్నాము. 2015 లో మోడీ పాలన మొదలయిన నాటి నుంచి నేటి వరకూ పాలనలో లోపాలను ఎత్తిచూపుతూ వేసిన సీరీస్‌లో ఇది నాల్గవది.

ప్రజల సొమ్ముతో తన పాలన గురించి ప్రచారం చేసుకుంటున్న ఈ సందర్భంలో మోడీ నాలుగేళ్ళ పాలనను అంచనా వేయవలసిన అవసరం మరింత ఎక్కువగా ఉన్నది. ఈ మధ్యనే సమాచార హక్కుతో తెలుసుకున్న వివరాల ప్రకారం, వివిధ మాధ్యమాల ద్వారా మోడీ తన ప్రభుత్వాన్ని ప్రచారం చేసుకోవడానికి రూ. 4343.26 కోట్లు ఖర్చు చేసారు. భర్తలు చనిపోయిన స్త్రీలకు చెల్లించే పెన్షన్ ఒక రూపాయి కూడా పెంచడానికి తన దగ్గర సొమ్ములేదంటూ ప్రభుత్వం నిరాకరిస్తున్న పరిస్థితులలో ఇంత పెద్ద మొత్తం ప్రచారానికి ఖర్చుచేయడం వెగటు కలిగిస్తుంది.

"పేదల పక్షపాతి"గా ఎన్నో విజయాలను సాధించినట్టు, అట్టహాసంగా జరుపుకుంటున్న మోడీ నాలుగేళ్ళ పాలనాసంబరాలను కర్ణాటక యెన్నికల ఫలితాలు కొంత నీరుగార్చాయి.

## వాస్తవం ఏమిటి ?

నాలుగేళ్ళ పాలన గురించి అంచనా వేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి పుస్తకంలో, **ధనికులను మరింత ధనికులగా పెంచే ఒక నమూనాగా మోడీ నమూనా ఎందుకుందో తెలియచేసే ఆర్థిక, విధానపరమైన మౌలిక అంశాల గురించి వివరించారు.** రెండు కోట్ల ఉద్యోగాల మాటేమిటి? అత్యవసర సరుకుల ధరలు అదుపు చేస్తానన్న వాగ్దానాల సంగతేమిటి? జన్ధాన్ యోజన, ఉజ్జ్వల యోజన అనే మోడీ మార్క్ పథకాల అసలు రంగేమిటి? ఈ విషయాలన్నీ

ఈ పుస్తకంలో ఉన్నాయి.

కనీవినీ ఎరగని రీతిలో ఈ కాలంలో పెరిగిన అసమానతలు మోడీ పాలనఅసలు స్వరూపానికి అద్దం పడుతున్నాయి. నిజానికి మోడీగారు తన మనసులోమాట (మన్‌కి బాత్) లో ఏనాడూ డబ్బు ప్రస్తావన (ధన్‌కి బాత్) తేలేదు. 2015 లో సామాజిక ఆర్థికసర్వే ఫలితాలను ప్రకటించినప్పుడు 75 శాతం గ్రామీణ కుటుంబాల నెలసరి ఆదాయం రూ. 5000/- కన్నా తక్కువగా ఉందని తేలింది. ఒక ఇంట్లో గనక ఐదుగురు సభ్యులు ఉన్నారని లెక్క వేసుకుంటే మనిషికి రోజుకి రూ. 33/- ఖర్చవుతున్నట్టు లెక్క తేలుతోంది. మరో వైపు క్రెడిట్ సుశి అంచనాల ప్రకారం మోదీగారి పాలనలో భారతదేశంలోని అత్యంత ధనికులుగా ఉన్న ఒక్క శాతం వద్ద పోగుపడిన సంపద పది శాతం పెరిగి 58 శాతానికి చేరుకుంది. అత్యంత ధనికులపై అతి తక్కువ పన్నులు వేయడం, వారి బ్యాంకు అప్పులను రద్దు చేయడం, కార్పొరేట్లకు రకరకాల రాయితీలివ్వడం, సబ్సిడీలివ్వడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమని తెలియచేస్తున్నది. ఎన్నికలకు ముందు మోడీ రహస్యంగా కార్పొరేట్లకు చేసిన ఈ వాగ్దానాలన్నీ అమలు చేసారు.

ఈ కాలంలో పాలకుల పంచన చేరిన వారి లాభాలు విపరీతంగా పెరిగి ఆశ్రిత పెట్టుబడి బాగా పెరగడాన్ని కూడా చూడగలం. అదానీ వ్యాపారమే ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2017 డిసెంబర్ నాటికి వారి సగటు నికర ఆస్తులు 124.6 % పెరిగాయి. క్రిందటి సంవత్సరం అత్యధిక లాభాలను ఆర్జించిన వారిలో ఆయన అందరికంటే పైన ఉన్నాడు. 2015-16, 2016-17 మధ్య కాలంలో బిజెపి ఆదాయం 81.18 %, రూ. 570 కోట్ల నుండి రూ. 1034.27 కోట్లకు పెరగడం యాదృశ్చికం కాదు.

కార్పొరేట్లు సులభంగా లాభాలను సంపాదించుకునేందుకు వీలుగా ప్రభుత్వం చేత రకరకాల విధానాలు రూపొందించడం, తత్ఫలితంగా పాలిత పార్టీకి విరాళాలు కుప్పలు తెప్పలుగా రావడం వెనక ఉన్న ఆంతర్యం లోతుగా పరిశీలించవలసిన అవసరం ఉంది. చెడు సంప్రదాయాల నుండి భారత దేశాన్ని విముక్తి చేస్తానన్న మోడీ వాగ్దానం వాస్తవంలో ఆ చెడు సంప్రదాయాలలో ఎలా తలామునకలుగా కూరుకుని పోయిందో ఈ పుస్తకంలోని ఒక భాగం తెలియచేస్తుంది.

రెండో పుస్తకం **ఆర్ఎస్ఎస్ కు చేసిన వాగ్దానాలు, అవి బాహాటంగా ప్రజలకు తెలియజేయక పోయినా, ఎలా అమలు చేసిందో తెలియచేస్తున్నది.** కిందటి సాధారణ ఎన్నికలలో మోడీ నాయకత్వానికి తన స్వంత పార్టీలో విభేదాలు ఏర్పడ్డప్పుడు ఆర్ఎస్ఎస్ ఆయనకు పూర్తిగా అండగా నిలబడింది. భారతదేశ ప్రధాని తన జీవితంలో

అత్యధిక భాగం ఆర్ఎస్ఎస్ ప్రచారకుడుగా ఉన్న విషయం బహిరంగమే.. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ప్రమాణం చేయడానికి ముందే ఆయన ఆర్ఎస్ఎస్ లో తీసుకున్న ప్రమాణానికి, భక్తి గీతానికి కట్టుబడి ఉన్నారు. రెండో పుస్తకంలో మోడీ ప్రభుత్వం హిందూ రాష్ట్రం స్థాపించడానికి బహిరంగంగాను ఆంతరంగికంగాను తీసుకున్న చర్యలను గురించి చర్చించడం జరిగింది. ఈ పుస్తకం రాజ్యాంగంలో మౌలిక అంశాలైన లౌకిక స్వరూపం పైనా, మైనారిటీలపైనా, ప్రజాతంత్ర, స్వయంప్రతిపత్తి గలసంస్థలపైనా, సమాఖ్యపైనా ఎలా దాడులు జరిగాయో వివరించడం జరిగింది.

ప్రస్తుతం రాజ్యాంగంలో సమాఖ్యపై జరుగుతున్న దాడి, రాష్ట్రాల హక్కులను దిగజార్చడం, భారతదేశాన్ని ఒకే కేంద్రం కిందకి తేవాలన్న ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగా గుర్తించబడడం లేదు. హిందీని దేశమంతా రుద్దాలనుకోవడం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. కానీ ఆ ప్రయత్నాలు ఆగలేదు. ఇదివరకటి కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాలపై పెత్తనం చేయలేదనికాదు. మోడీ ప్రభుత్వం అన్ని పూర్వపు రికార్డులను తిరగ రాసింది. 15వ ఆర్థిక సంఘానికి చేసిన సిఫారసులను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ పుస్తకంలో కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ 15 వ ఆర్థిక సంఘ సిఫారసులకు సంబంధించిన అన్ని అంశాలను గురించి వ్రాసిన ఒక వ్యాసం ఉంది. ఈ పుస్తకంలో కాశ్మీర్లోని పరిస్థితులకి సంబంధించిన వ్యాసం కూడా ఉంది. కాశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాల పూర్తి వైఫల్యం, అందుకు పర్యవసానంగా అక్కడి ప్రజలు పూర్తిగా వేరుపడిపోయిన వైనం తేట తెల్లంగా చెప్పబడింది.

నిజానికి పాలకులు దేశంలోని ఇతర ప్రాంతాలలో తప్పుడు జాతీయవాదం లేవనెత్తేందుకు కాశ్మీర్ని ఉపయోగించుకుంటున్నారు. భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానంతో దేశాన్ని "ప్రపంచ శక్తిగా గుర్తించేటట్టు, గౌరవించేటట్టు" చేస్తామన్న వాదనను ఇందులో విశ్లేషించడం జరిగింది. భారత దేశ విదేశాంగ విధానాన్ని మోడీ వ్యక్తిగత సంబంధంగా దిగజార్చి విదేశాంగ విధానం రూపొందించడంలో ఏంతో అనుభవమున్నవారి అనుభవాలను కించపరచినందువలన విదేశాంగ విధానం ఆటుపోట్లకు గురై చిరకాల మిత్రులను స్నేహితులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. మోడీ ప్రభుత్వం అంతకు ముందటి యుపిఎ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లాగానే దేశాన్ని అమెరికా జూనియర్ భాగస్వామిని చేసి ఘోరమైన విధానాలను తీవ్రంగా అమలుచేయడం ప్రారంభించింది. భారతదేశాన్ని అమెరికా వ్యూహాత్మక భాగస్వామిని చేసింది.

బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలోగాని, ఆ తరువాత గాని ప్రజలలోని అనేక

తరగతులకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు, ముఖ్యంగా దళితులకు ఆదివాసీలకు వివిధ రకాల వాగ్దానాలను చేసింది. ఈ మేనిఫెస్టో అందరికి విద్య, వైద్యం అందిస్తామని కూడా వాగ్దానం చేసింది. ఈ వాగ్దనాలు బిజెపి పరిపాలనకు మంచి రోజులు తెచ్చిపెట్టి ఉండేవి.

మూడు నాలుగు పుస్తకాలలో **ఈ వాగ్దానాలు వాటి అమలు గురించి ప్రస్తావించడం జరిగింది.** ఈ ప్రభుత్వ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. మోడీ ప్రభుత్వం ఉద్యోగులకు కొత్తగా ప్రవేశ పెట్టిన పరిమితకాల నియామకాలు కార్మికులను అవసరానికి తీసుకుని అవసరం తీరగానే తీసివేసే విధానాన్ని ప్రవేశ పెడుతుంది. ఈ పద్ధతిని యజమానులు ఎప్పటినుండో కోరుకుంటున్నారు. పార్లమెంటులో అతి పెద్ద ఏకైక పార్టీగా ఉండి కూడా మహిళా రిజర్వేషన్ బిల్‌ను తొక్కిపెట్టి మహిళలకు తీరని అన్యాయం చేసింది. ఈ ప్రభుత్వ హయాంలో దళితులూ ముందెన్నడూ లేనంతగా జీవనోపాధిని కోల్పోయారు. వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే తీవ్రమయిన దాడులను, ఎదుర్కొన్నారు. అటవీ అధికారాల చట్టంనీరుగార్చబడింది. తరతరాలుగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ఉన్న వారి స్థానాలనుండి తొలగించ బడుతున్నారు. ఆధార్ ప్రభుత్వానికి ఒక వరంగా మారింది. ఇది ప్రభుత్వం పేద ప్రజలకు అందవలసిన హక్కులు అందకుండా చేయడానికి ఒక ఆయుధంగా తయారయింది. ఈ రెండు పుస్తకాలూ బిజెపి పేదలకు అనుకూలమన్న వాదనను ఆధారాలతో సహా తప్పని రుజువు చేస్తాయి.

మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలు ఈ ప్రభుత్వ పాలన అంతం కానున్నదని సూచిస్తున్నాయి.

వామపక్షాలు అనుసరించబోయే ప్రత్యామ్నాయ విధానాలు చెప్పడం ఈ పుస్తకాల పరిధిలో లేదు. ఆ విధానాలకు సంబంధించిన సమాచారం కేరళ, బెంగాల్ త్రిపురలలోని వామపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలలో విరివిగా అందుబాటులో ఉండనే ఉన్నది. ఆసక్తి ఉన్నవారు వాటిని అధ్యయనం చేయవచ్చు. ఇప్పుడు కేరళ లో పినరయి విజయన్ నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం రెండో వార్షికోత్సవం జరుపుకుంటున్నది. ఈ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను చాలా వరకు అమలు జరిపి ప్రజాకేంద్రంగా అభివృద్ధి జరగడానికి ఒక నమూనాగా నిలిపింది. వివిధ కారణాల వలన ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ మాణిక్ సర్కార్ త్రిపురని ఎన్నో సామాజిక సూచికలలో అగ్రభాగాన నిలిపారు. అంతకు ముందు పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలుచేసి, పంచాయత్ వ్యవస్థను పటిష్ట పరచి చరిత్ర సృష్టించింది. ఈ ప్రభుత్వాలు వివిధ తరగతుల ప్రజల మధ్య

సామరస్యాన్ని పెంచి పురోగమనాన్నీ సాధించాయి. అందువలననే బిజెపి – ఆర్ఎస్ఎస్ వామపక్షాలను తమ సైద్ధాంతిక శత్రువులుగా పరిగణిస్తాయి. వారి విష ప్రచారానికి విభజించి పాలించే తత్వానికి అడ్డంకిగా భావిస్తాయి.

ఈ నాడు ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని, ప్రజల హక్కులను కాపాడడానికి అవసరమయిన ప్రత్యామ్నాయ విధానాలకు, ప్రత్యామ్నాయ రాజకీయాలకు వామపక్షాలు ఛాంపియన్స్‌గా ఉన్నాయి. పైన చెప్పిన కారణాల రీత్యా బిజెపి – ఆర్ఎస్ఎస్‌ల విధానాలను సవాలు చేస్తూనే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల మధ్య ఐక్యతను సమీకరణ బలాన్ని పెంచుకుని భారతదేశానికి భారత ప్రజలకు అవసరమయిన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ పుస్తకాలను రూపొందించడానికి అనేకమంది కామ్రేడ్స్ ఎంతో శ్రమించారు. సవేరా, శ్యాం, ప్రాంజల్, సోనాలి, ప్రబీర్ పూరకాయస్థ, రాజేంద్ర శర్మ, బాదల్ సరోజ్, సుభాషిణి అలీ, విజూ కృష్ణన్, రఘు, వెంకటేష్ ఆత్రేయ, జుబిన్ డెన్నిస్, అజయ్ కుమార్‌లకు ధన్యవాదాలు.

ఈ పుస్తకానికి కార్టూన్లు గీసిచ్చిన

కార్టూనిస్టులకు కూడా ధన్యవాదాలు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి, రానున్న రోజులలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోడానికి ఈ పుస్తకం ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను.

**బృందా కరత్**
**మే 2018**

# భారత రాజ్యాంగంపై దాడి



**భా**రత రాజ్యాంగం గురించి బిజెపి, దాని గురువైన ఆర్ఎస్ఎస్‌లు పైకి ఏమి చెప్పినప్పటికీ నిజానికి ప్రతినిత్యం దానిని వుల్లంఘిస్తునే వున్నాయి, 1950కి ముందే నూతన రాజ్యాంగంపట్ల ఆర్ఎస్ఎస్ అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ మనుస్మృతిని అనుసరించాలని చెప్పటం ద్వారా ఈ ప్రక్రియ ప్రారంభమైంది. 2014లో అధికారాన్ని చేపట్టిన వెంటనే బిజెపి, సంఘ్‌పరివార్‌లు రాజ్యాంగంపై బహుముఖ దాడులకు దిగాయి. అన్నిటికన్నా దుర్మార్గమైనది దాని లౌకిక లక్షణాలకు తిలోదకాలు ఇవ్వచూడటం. వారి దృష్టిలో లౌకికవాదం అన్నమాటే నీచమైనది. రాజ్యాంగం నుంచి దానిని తొలగించాలన్నది వారి లక్ష్యం.

కార్యనిర్వాహక వర్గాన్నంతటినీ (ప్రధాన మంత్రి నుండి దిగువ వరకు) ఆరెస్సెస్ వారితో నింపివేసిన తరువాత, హిందూరాష్ట్ర సృష్టికి అంకితమై పలువిధాలుగా మత దురభిమానాన్ని, హిందూత్వ ఛాందసాన్ని పెంచిపోషిస్తూ రాజ్యాంగ విలువలను హరించసాగారు. అభ్యుదయ విధానాలతో సహా మైనారిటీల హక్కుల రక్షణను ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోవటంలేదు. దీనంతటి ఫలితంగానే మతవిభజన, విద్వేష ప్రసంగాలు, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయి.

బిజెపి, నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీలు ప్రతి ప్రదర్శనలోనూ,

ప్రతి సభలోనూ "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" అన్న కీలక నినాదాన్ని పదేపదే వినిపిస్తుంటారు. అన్ని సమాజాల సహకారంతో, అన్ని సమాజాలను అభివృద్ధి చేస్తాము అన్నదే దీని అర్థంగా బిజెపి చెప్పుకొచ్చింది.



అయితే, నాలుగేళ్ళ క్రితం, అంటే 2014లో అధికారాన్ని చేపట్టిన అనంతరం బిజెపితోపాటు సంఘపరివార్‌లోని దాని నాయకుల దుర్మార్గ ప్రసంగాలతో రెచ్చిపోయిన మతవాదులు మైనారిటీలపై హింసాకాండకు తెరతీశారు; వారిపై చట్టబద్ధమైన చర్యలు చేపట్టకుండా రక్షణ కల్పిస్తున్నారు, ప్రజలలో అబద్ధాలతోనూ, విద్వేషాలతోనూ కూడిన విషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. హిందువుల పండుగలు మైనారిటీ మతస్తులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆయుధ పూజలుగా మారుతున్నాయి. ముస్లిములపైనా, దళితులపైనా దాడులు చేసేటందుకుగాను గోరక్షణను హిందూ దురభిమానులు ఒక సాకుగా ఉపయోగించుకుంటున్నారు. బహిరంగ సభల్లో ప్రచారాల పేరుతోనూ, సామాజిక మాధ్యమాల ద్వారా విద్వేషపూరిత సమాచారంతోనూ అన్నిరకాల ఎన్నికలు మతప్రచారంతో కలుషితమవుతున్నాయి. 2014 తరువాత జరిగిన 24వ శాసనసభ ఎన్నికలలోగానీ, లేదా 2014లో జరిగిన లోకసభ ఎన్నికలలోగానీ బిజెపి పార్టీ ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా నిలపలేదు.

హింసాకాండకు స్థానిక పోలీసులు కూడా చేతులు కలిపినట్లుగా పలు సందర్భాలలో వార్తలు వెలువడుతున్నాయి. దీనితోపాటే, మక్కా మసీదు, మాలెగావ్ తదితర ప్రాంతాలలో సంభవించిన బాంబు పేలుళ్ళ కేసుల్లో హిందూత్వ ఉగ్రవాదులకు వ్యతిరేకంగానూ, అలానే 2002లో గుజరాత్‌లో ముస్లిములపై సాగించిన ఊచకోత వ్యవహారంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన వారికి వ్యతిరేకంగానూ సమర్థవంతమైన విచారణ కొరవడింది. ఇలాచేయటం ద్వారా ప్రభుత్వం తమను రక్షించగలదన్న స్పష్టమైన సందేశాన్ని హింసావాదులైన హిందూత్వ తీవ్రవాదులకు ఇచ్చినట్లయింది. దీనంతటి ఫలితంగా హిందూత్వ దురహంకారుల దాడులు, జాత్యహంకారుల ప్రచారమూ, హింసాకాండ అనేవి దేశ సామాజిక పొందికనూ, సామరస్యాన్నీ తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

- **మతపరమైన హింసాకాండ:** 2014-2017 మధ్య (అందుబాటులో వున్న అధికారిక సమాచారం ప్రకారం) మతపరమైన హింసాకాండ 28 శాతం

పెరిగింది. ఈ మూడేళ్ళ కాలంలో దాదాపుగా 3,000 మతోన్మాద ఘటనలు సంభవించాయి. వీటిల్లో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారుగా 9,000 మంది గాయపడ్డారు.

- అధికారిక లెక్కల ప్రకారం మతతత్వ హింసావాదాన్ని రెచ్చగొటిన వారి సంఖ్య 2014లో 366 అయితే 2017లో 475గా వున్నారు, అంటే 41 శాతం పెరిగారు.
- 2018 తొలి నాలుగు మాసాలలో బీహార్‌లోని 13 జిల్లాలు, రాజస్థాన్‌లో 3 జిల్లాలు, పశ్చిమ బెంగాల్‌లో 3 జిల్లాలు మతహింసకు గురయ్యాయి. హిందువుల పండగైన రామనవమి సందర్భంగా సంఘపరివార్ అనుచరులు, లేదా బిజెపీ నాయకత్వాన సాగిన సాయుధ మూకల ప్రత్యక్ష ప్రేరణతో యివి జరిగాయి.
- **గోవు పేరుతో హత్యలు**: మోడీ అధికారాన్ని అధిష్టించిన తరువాత గోసంరక్షణ పేరుతో 78 వరకు మూకుమ్మడి దాడులు, హత్యలు చోటుచేసుకున్నాయి. వీటిల్లో ఎక్కువ భాగం సంఘపరివార్ అనుచరులే జరిపించారు. భయంకరమైన యీ దాడుల్లో 29 మంది చనిపోగా, 273 మంది గాయపడ్డారు, కాగా 148 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- దెబ్బతిన్న వారిలో మూడింట రెండువంతులు ముస్లిములు, మిగిలిన వారిలో ఎక్కువమంది దళితులు. ఈ ఘటనలన్నీ గొడ్డుమాంస భక్షణ, గోవధ తదితరాల గురించిన ఆటవికమూ, కట్టుకథలతో కూడిన పుకార్ల కారణంగానే తలయెత్తాయి. కొన్ని సమయాలలో ఫరీదాబాద్‌లో జునైడ్ హత్య, రైలులో సంభవించిన చిన్నపాటి ఘటనను పురస్కరించుకుని కోపోద్రిక్తులైన మూక హత్యకు పాల్పడటం వంటివి జరిగాయి. ఎక్కువ భాగం కేసుల్లో హంతకులను వదిలివేయటమో, లేదా కోర్టుల్లో కేసులు నిలబడి పోవటమో జరుగుతోంది.
- **మతపరమైన ఆయుధంగా అత్యాచారాలు:** ఈ ఏడాది జనవరిలో చోటుచేసుకున్న ఆటవిక ఘటన యిది. జమ్మూలోని కటువాలో అపహరణకు గురైన ఎనిమిదేళ్ళ వయసున్న బకేర్వాల్ బాలిక చివరకు ఒక మత ప్రదేశంలో విగతజీవిగా కనిపించింది. ఆ బాలిక హత్య కావటానికి ముందు పలుమార్లు అత్యాచారానికి గురైంది. తమ గ్రామం సమీపంలో స్థిరనివాసం ఏర్పరచుకున్న బకేర్వాల్ ముస్లిములను అక్కడ నుండి వెళ్ళగొట్టాలన్నదే నిందితుల వుద్దేశాలలో ఒకటిగా వున్నది. ఆర్ఎస్ఎస్, బిజెపిలు వారి అనుచరగణం నిందితుల తరపున బాహాటంగానే నిలిచారు. గుజరాత్‌తోపాటు మరికొన్ని చోట్ల

హిందూత్వ ఛాందసవాదులు సాగించిన అత్యాచారాలను, అవమానాలను యీ సంఘటన గుర్తుకు తెస్తున్నది.

- **క్రైస్తవులపై దాడులు**: దేశంలో నివసిస్తున్న మరో మైనారిటీ సంఘుస్తులయిన క్రైస్తవులు సైతం సంఘ్‌పరివార్ నుంచి అంతకంతకు పెరుగుతున్న హింసకు గురవుతున్నారు. గత నాలుగేళ్ళ కాలంలో దేశం మొత్తంమీద చర్చిలు, మఠాలు, క్రీస్తు ఆరాధనలపైన, అలానే క్రిష్టమస్, ఈస్టర్ పండుగ సమయాలలో దాదాపుగా 700 దాడులు జరిగాయి. బాధితులను భయపెట్టటంతో చాలా కేసులు పోలీసుల వద్దకు రాకుండానే పోతున్నాయి.
- కల్‌బుర్గి, పన్సారె, దబోల్కర్, గౌరిలంకేశ్‌ల హత్యలకు హిందూత్వ దురభిమానులే కారణమన్న ఆరోపణలు వున్నాయి. ఇవన్నీకూడా హేతువాదంపైనా, అభ్యుదయ ఆలోచనలపైనా దాడులకుదిగే సంఘ్‌పరివార్ యొక్క పాపిష్టి ఆలోచనలను తెలియ చేస్తున్నాయి.

సమాజంలో మతతత్వం పెరగటంతో దేశంలోని పలు ప్రాంతాలలో పరస్పర ఘర్షణలు, వుద్రిక్తతలు పెరుగుతున్నాయి. చివరకు కొద్దిపాటి ఘర్షణల నేపథ్యం ఉన్న చోట కూడా యీ పరిస్థితి తలయెత్తుతున్నది. ఈ సందర్భాలన్నిటా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఆరెస్సెస్ అనుబంధ మూకల చేతివాటాన్ని గమనించవచ్చు. అత్యంత ప్రమాదకరమైన యీ వ్యూహం మైనారిటీ సామాజికులను మైనారిటీ ఛాందసవాదుల వైపుకు నెడుతున్నది, ఆరకంగా వారు మరింత దూరమవుతున్నారు.

ఆర్ఎస్ఎస్ వండివార్చుతున్న అనేకానేక ‘విషయాలలో’ ముస్లిములకూ, క్రైస్తవులకూ వ్యతిరేకంగా ‘లవ్ జిహాద్’, బలవంతపు మతమార్పిడులు, గొడ్డుమాంస భక్షణ, జనాభా పెరుగుదల, పాకిస్థాన్‌పట్ల, లేదా అంతర్జాతీయ జీహాదీలపట్ల విధేయత తదితరాలంటూ వారిపై విషాన్ని చిమ్ముతున్నారు. చివరకు మైన్మార్‌లో అత్యంత కిరాతకమైన జాతి హననాన్ని ఎదుర్కొంటూ భారత్‌కు పారిపోయి వచ్చిన రోహింగ్యాలను సైతం వీరు తమ లక్ష్యంగా చేసుకున్నారు. భారతదేశంలోకి ముస్లిముల ప్రవేశాన్ని నిషేధించేటందుకు దీనినొక వుదాహరణగా తీసుకోవచ్చు.

ఇదిలా వుండగా ప్రభుత్వం ఏవో కొన్ని కపటపూరితమైన, వుపశాంతి ప్రకటనలు యివ్వటం మినహా యీ విషయాలన్నిటిపైనా, అలానే పెరుగుతున్న హింసపైనా మౌనాన్ని పాటిస్తున్నది. అయితే తెరవెనుక మాత్రం హింసను రేపే వారికి భద్రతను కల్పిస్తున్నారు, కాగా నేరంలో ఎవరైనా ముస్లిం వ్యక్తి వున్నట్లయితే బిజెపి నాయకులు క్రియాశీలంగా వుంటున్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ ప్రమాణము

“సర్వశక్తిమంతుడైన భగవంతుని ముందు, నా పూర్వీకుల ముందు అత్యంత భయభక్తులతో యీ ప్రతిజ్ఞ తీసుకుంటున్నాను. నేను పవిత్రంగా భావించే హిందూ మతం, హిందూ సమాజం, హిందూ సంస్కృతులను పెంచటం ద్వారా సర్వోత్కృష్టమైన భరతవర్ష సాధన కోసం నేను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యునిగా చేరుతున్నాను. సంఘం యిచ్చిన కార్యాన్ని సగౌరవంగా, నిస్వార్థంగా నా హృదయంతోనూ, ఆత్మతోనూ నెరవేర్చగలను, నా యావజ్జీవితమూ యీ లక్ష్యానికే కట్టుబడి వుంటాను. భారతమాతాకీ జై”

## ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన

వాత్సల్యపూర్ణా! ఓ మాతృభూమీ, నేను నీకు ఎల్లప్పుడూ నమస్కరింతును. ఓ హిందూభూమీ! నీవల్లనే నేను సుఖముగా వర్ధిల్లినాను. మహా మంగళమయీ! ఓ పుణ్యభూమీ, నీ కార్యసాధనకై యీ నా శరీరము సమర్పింపబడుగాక. నీకివే అనేక నమస్కారములు. సర్వశక్తిమాన్! ఓ పరమేశ్వరా! హిందూ రాష్ట్రమునకు అవయవ స్వరూపులమైన మేము నీకు సాదరముగ నమస్కరించు చున్నాము. నీ కార్యము కొరకే కటిబద్ధులమై వున్నాము. దానిని నెరవేర్చుటకై మాకు శుభాశీస్సులనిమ్ము.

ప్రభుత్వం పాటిస్తున్న వివక్షతాపూర్వ విధానాలను మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చేసిన బడ్జెట్ కేటాయింపులలో కూడా చూడవచ్చు, ఈ కేటాయింపులు అత్యల్పం; 2018–19 మొత్తం వ్యయంలో కేవలం 0.19 శాతాన్ని మాత్రమే కేటాయించారు. భారత జనాభాలో మైనారిటీలు 21 శాతంగా వున్నప్పటికీ మోడీ ప్రభుత్వ హయాంలో కేటాయింపులు యీ విధంగానే వుంటున్నాయి. మైనారిటీ మంత్రిత్వశాఖలో నిధుల వినియోగంలో కూడా తగ్గుదల వున్నది, 2015–16లో యీ వినియోగం 97 శాతం కాగా, గత ఏడాది వినియోగం 74 శాతంగా వున్నది. మైనారిటీలకు ప్రభుత్వ రంగం ఇందులో యిచ్చే రుణం 16 శాతం పెరిగినప్పటికీ, మైనారిటీలలో 72 శాతంగా వున్న ముస్లిములకు 45 శాతం రుణాలు మాత్రమే దక్కుతున్నాయి. సచార్ కమిటీ సిఫారసులను చాలా రాష్ట్రాలు అమలు పరచలేదు. అమలు పరిచిన చోటా ప్రయోజనాలు చేకూరకుండా అమలు పరిచారు.

యింత బహిరంగ పక్షపాతాన్నీ, మతతత్వ ప్రభుత్వాలను అటు కేంద్రంలోనూ, యిటు రాష్ట్రంలోనూ బిజెపి నడుపుతున్న ప్రభుత్వాలలాంటి ప్రభుత్వాలను యింతకు ముందెన్నడూ భారతదేశం ఎరుగదు. ప్రభుత్వమూ, దాని నాయకుడు నరేంద్ర మోడీ చెప్పే యితర అబద్దాల లాంటిదే సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అన్న నినాదం కూడా పచ్చి అబద్దం. నరేంద్రమోడీకి ఉత్తుత్త ప్రచారాలంటే మహామోజుకదా!

***

# సంఘ్ స్వాధీనంలో

'భారతదేశానిది ప్రథమ స్థానం' అంటూ చెప్పటానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఎన్నడూ అలిసిపోలేదు. దేశం అన్నిటా ముందున్నదన్నదే ఆయన వుద్దేశం. 2014 ఎన్నికల ప్రణాళికలోనూ, ప్రచారంలోనూ ఆయన పదేపదే సత్పరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనం, రాజ్యాంగ నిబద్ధత, "సజీవమూ, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యము" కలిగిన నిర్మాణము అన్న అంశాలను నొక్కిచెప్పారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి తన నైజాన్ని బయట పెట్టుకున్నది. ప్రజాతంత్ర వ్యవస్థలను నాశనం చేయటమే దాని లక్ష్యంగా కనిపిస్తున్నది. రాజ్యాంగం అంటే లక్ష్యం లేదు. అది పదేపదే రాజ్యాంగాన్ని వుల్లంఘిస్తున్నది, సువ్యవస్థీకృతమైన పార్లమెంటరీ, ప్రభుత్వ సంప్రదాయాలను తోసిపుచ్చుతున్నది. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వర్గము, సైనిక దళాలు, యితర రాజ్యాంగ వ్యవస్థలైన ఆర్‌బిఐ, సివిసి, ఎన్నికల సంఘం, విద్యాసంస్థలు వంటివన్నీ తమ ముందు మోకరిల్లేలా చేసుకుని, మోడీ ఆజ్ఞలను పాటించేలా తయారు చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వ విధానంలోని ముఖ్యమైన అంశమేమంటే, అన్ని వ్యవస్థలను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులతో నింపేయడం. ప్రభుత్వ అధికారులతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సైతం నిర్ణయాధికార సమావేశాలలో వుంటున్నారు, ఆచరణలో అన్ని విద్యాసంస్థలలోనూ, సంఘాలలోనూ వుంటున్నారు. వారే అన్ని రకాల కమిటీలను, బోర్డులను అదుపు చేస్తున్నారు. ఇదేమీ సౌకర్యార్థమో, దేశభక్తియుతమో కాదు. ప్రస్తుత ప్రభుత్వ కాలం ముగిసినప్పటికీ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఎల్లెడెలా వ్యాపింప చేసేటందుకై ప్రజాతంత్ర వ్యవస్థలను తమ చెప్పుచేతల్లో వుంచుకునే దీర్ఘకాలిక వ్యూహమిది. ఈ నాణానికి మరోవైపు ఏమిటంటే, యిలా చెప్పుచేతల్లో వుంచుకోవటాన్నిగానీ, లేదా ఆర్‌ఎస్‌ఎస్ అధీనంలోని సంస్థలు తయారు చేసే

విధానాలనుగానీ వ్యతిరేకించే వారిని 'జాతి వ్యతిరేకులు'గా ముద్ర వేయడంతో పాటు వెంటపడి వేధిస్తున్నారు.

## పార్లమెంటును దిగజార్చటం

మొట్టమొదటిసారిగా ఎలాంటి చర్చా లేకుండానే యీ ఏడాది కేంద్ర బడ్జెట్ ఆమోదాన్ని పొందింది. పార్లమెంటును ప్రహసన ప్రాయంగా మార్చివేశారు. ప్రజాధనాన్ని ఎలా వుపయోగిస్తున్నదీ చర్చించేటందుకై ప్రజా ప్రతినిధులను అనుమతించ లేదు. అంతేకాదు, అవిశ్వాస తీర్మానాన్ని కూడా అనుమతించ లేదు. పాలక పార్టీ అయిన బిజెపికి చెందిన స్పీకర్ సభా సమావేశాలను వాయిదా వేశారు. తీర్మానంలోని బాగోగులను నిర్ణయించే అధికారం లేనప్పటికీ ప్రధాన న్యాయమూర్తిని అభిశంసించే తీర్మానాన్ని రాజ్యసభ అధ్యక్షుడు ఏకపక్షంగా త్రోసిపుచ్చారు. అనేక ముఖ్యాంశాలకు సంబంధించి చట్టాలలో మార్పు తెచ్చేటందుకై ప్రభుత్వం పలు సందర్భాలలో ఆర్డినెన్స్ మార్గాన్ని ఎంచుకుంటున్నది. ఇలాంటి వాటిల్లో భూసేకరణ చట్టం ఒకటి, వామపక్షవాదులు, యితర అభ్యుదయ శక్తులు పెద్దయెత్తున ఆందోళన చేయటంతో దానిని వెనక్కు తీసుకున్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య రాజ్యసభ స్థానాల పంపకం, జౌళి, బొగ్గుగనులను పునః ప్రకటన చేసే ఆర్డినెన్స్, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి నియామకం వంటివి తిరస్కరించిన వాటిల్లో వున్నాయి. ఇవన్నీకూడా పార్లమెంటునూ, దాని ప్రజాతంత్ర పనితీరును దెబ్బతీసేవిగా వున్నాయి. ఆర్డినెన్స్ విధానం పాలక పార్టీ దురహంకారానికి ప్రతీక, సరైన విధానం అనుసరించడం గానీ జవాబుదారీతనంగానీ లేకుండా ప్రభుత్వం వీటన్నిటినీ చేయాలనుకుంటున్నది.

## రాష్ట్ర గవర్నర్లు

కేంద్రంలోనే కాకుండా రాష్ట్రాలలో సైతం ప్రజాతంత్ర వ్యవస్థలపైనా, పద్ధతులపైనా బిజెపి తన వుక్కు పాదాన్ని మోపుతున్నది. రాష్ట్రాలలో ప్రజాస్వామ్యాన్ని తొక్కివేయటానికిగాను గవర్నర్లను తన పనిముట్లుగా వాడుకుంటున్నది. ఇక్కడ ఒక సంగతిని గుర్తుంచు కోవాలి, అదేమంటే ప్రస్తుతం పదవుల్లో వున్న గవర్నర్లలో అత్యధికులు ఆర్ఎస్ఎస్‌తో (లేదా దాని సానుభూతిపరులు) సంబంధమున్నవారే, అంతేకాక మోడీ ప్రభుత్వానికి పనిముట్లుగా వుండటానికి ఉత్సాహపడుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీ ప్రభుత్వానికీ, కేంద్రానికీ మధ్య నడుస్తున్న జగడం యిందుకు బహు చక్కని వుదాహరణ. వరుసవారీగా వస్తున్న ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్లు వివిధ పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలను వెనక్కు పంపుతున్నారు. మోడీ ప్రభుత్వం నిరంతరం కల్పిస్తున్న ఆటంకాల కారణంగా ప్రజలెన్నుకున్న ముఖ్యమంత్రి సజావుగా ప్రభుత్వాన్ని

నడపలేక పోతున్నారు. అధికారాన్ని చేజిక్కించుకునేందుకై గవర్నర్లను బిజెపి ఎలా వాడుకుంటున్నదీ తెలుసు కోవటానికిగాను గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలు తాజా వుదాహరణలుగా వున్నాయి. ఈ గవర్నర్లు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ బేరసారాల ద్వారా లేదా రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటం ద్వారా బిజెపి తన ప్రభుత్వాలను ఏర్పరిచేలా చేస్తున్నారు. వారికి రాజ్యాంగం కల్పించి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

## న్యాయవ్యవస్థ

భారత రాజ్యంలోని వివిధ అంగాలను బిజెపి పలుకుబడి కిందకు తెచ్చే ప్రయత్నంలో చివరికి న్యాయ వ్యవస్థనూ మినహాయించ లేదు. స్వతంత్ర భారతంలో మొట్టమొదటిసారిగా సుప్రీం కోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు పత్రికా గోష్టిని నిర్వహించి న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం కోసం నిలవ వలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం యీ నలుగురిలో ఒకరు భారత ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ న్యాయవ్యవస్థ స్వతంత్రతను రక్షించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవస్థ జీవమూ, వునికీ తీవ్ర ప్రమాదంలో చిక్కుకున్నాయని ఈ విపత్తు నుండి బయట పడేందుకు శాస్త్ర చికిత్స తప్పనిసరి అని, తక్షణ జోక్యం అవసరమని యీ న్యాయమూర్తి పేర్కొన్నారు. జరిగిందేమంటే, బిజెపికి అనుకూలమైన రీతిలో రోస్టర్‌ను (పని కేటాయింపు) ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేశారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నియామకంలో సైతం ప్రభుత్వం బహిరంగంగానే జోక్యం చేసుకుంటున్నది. ఇందుకు యిటీవలి వుదాహరణను తీసుకోవచ్చు. ఎప్పటి వాడుక ప్రకారమే జస్టిస్ జోసప్‌ను కొలీజియం సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వం మాత్రం దానిని తోసిపుచ్చింది.

"హిందువులే ప్రథములు" అన్న చారిత్రక వృత్తాంతాన్ని లిఖించడానికిగాను సాంస్కృతిక మంత్రి ద్వారా ప్రభుత్వం 14మందితో ఒక కమిటీని నియమించింది. ఈ సందర్భంగా యీ విషయాన్ని సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్ శర్మ పచ్చిమత భాషలో వివరించాడు. బ్రహ్మాండమైన బడ్జెట్‌ను సమర్పిస్తూ కమిటీ చైర్మన్ కె.ఎన్.దీక్షిత్ యిలా పేర్కొన్నాడు, "ప్రాచీన చరిత్రకు సంబంధించి నిర్దిష్ట అంశాలను పునర్లిఖించేందుకు వీలుగా ప్రభుత్వానికి తోడ్పడేలా ఒక నివేదికను రూపొందించ వలసిందిగా నేను కోరాను". కాగా, మహాభారత, రామాయణములు యథార్థ చరిత్రగా రుజువు చేసేవిగా వుండాలని మంత్రిగారు తన మాటగా చెప్పారు. ఆవిధంగా చరిత్రను సరిదిద్దే పౌరాణికుల కార్యక్రమాన్ని యీ ప్రభుత్వం చేపట్టింది, యిది ఆర్ఎస్ఎస్

తలచిన చిరు కార్యక్రమం.

ఈ ప్రభుత్వానికి అసమ్మతి ఎదురైంది. ఏ రూపంలో అయినా, ఏవిధంగా అయినా అసమ్మతి ఎదురైతే దానిని జాతివ్యతిరేకతగా భావించవలసి వస్తుందని చెప్తూ ఆ విషయాన్ని ఆపివేశారు. ఎవరైతే ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారో ఆ ప్రతిపక్ష నాయకులనూ, యితరులనూ బెదిరించేటందుకై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపన్ను శాఖ అనే త్రిమూర్తులు అక్కడనే వున్నారు.

దిగ్భ్రాంతి కొలిపే విషయమేమంటే సరికొత్త యంత్రాంగాన్ని వుపయోగించి సామాజిక మాధ్యమాన్ని నియంత్రించేటందుకై ప్రభుత్వం సిద్ధపడింది. ఇది సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలో వుంటూ ప్రభుత్వానికి అత్యాధునిక రీతిలో గూఢచర్యం చేసిపెడుతుంది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను నియమించుకునేందుకు ప్రస్తుతం యుపిఎస్‌సి పరీక్షలు నిర్వహించబడుతున్నాయి. ఈ విధానం అమలు కూడా సజావుగానే ఉంది. కాని తన నమ్మిన బంటులను ప్రభుత్వ యంత్రాంగంలోకి తనకిష్టమైనట్టుగా జొప్పించేందుకు ప్రధాన మంత్రి కార్యాలయం ప్రస్తుత విధానంలో మార్పులు చేసి, బదులుగా ఈ సర్వీసుల నియామకాలలో జోక్యం చేసుకుని తన కనువయిన వారిని నియమించుకునే ప్రయత్నంలో పడింది.

## రాజ్యాంగ సంస్థలు

ఆర్‌బిఐ, ఎన్నికల సంఘం, కేంద్ర నిఘా కమిషన్, కాగ్ వంటి సంస్థల స్వయం ప్రతిపత్తిలో ప్రభుత్వం నిరంతరం జోక్యం చేసుకుంటున్నది. ఉదాహరణకు, 2016 నవంబరులో ప్రకటించిన వినాశకర నోట్లరద్దు నిర్ణయాన్ని తీసుకున్నపుడు, భారీ ఎత్తున యీ పనికి సన్నద్ధం కావలసి ఉన్న ఆర్‌బిఐకి కేవలం 24 గంటల సమయాన్ని మాత్రమే యిచ్చారు. నరేంద్ర మోడి ప్రభుత్వం దౌర్జన్య ఇలాగే ఉంటుంది. ఈ ఘటనతో ఆర్‌బిఐ పరువు బజారున పడింది. ఆర్‌బిఐ మిగిలిన నియంత్రణ వ్యవస్థల వంటిది కాదు. దాని విధులు మౌలికంగా మిగిలిన నియంత్రణ వ్యవస్థలకన్నా వేరుగా ఉంటాయి. ప్రభుత్వం దానిపనిలో జోక్యం చేసుకోవడంతో ఆర్‌బిఐ స్వయం ప్రతిపత్తి సంస్థగా ఉన్న గుర్తింపుకు మచ్చ ఏర్పడింది. నోట్లరద్దు సమయంలో నిబంధనలను నిరంతరంగా మార్చారు, ఈనాటికి ఆర్‌బిఐ తిరిగి వచ్చిన నోట్ల వివరాలను సరిగ్గా యివ్వలేక పోతున్నది.

ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ ఆజ్ఞలకు రాజీపడి లొంగిపోయినట్లుగా కనపడుతున్నది. ఉదాహరణకు, గుజరాత్‌లో ప్రధానమంత్రి మోడీ పర్యటించి వివిధ

పథకాలను ప్రకటించేటందుకు వీలుగా ఎన్నికల సంఘం అక్కడి ఎన్నికలను వాయిదా వేసినట్లుగా వున్నది, అలాచేయనట్లయితే ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎలాంటి వాగ్దానాలు చేయటానికి వీలుండదు. ఎన్నికల షెడ్యూల్డ్‌ను, తేదీలను, ఎన్నికల నిర్వహణను లోగడ కూడా ఎన్నికల సంఘం అనేక సార్లు మార్పు చేసినట్లుగా ఆరోపణలు వున్నాయి.

## విద్యా సంస్థలు

ఆచరణలో చూసినట్లయితే దేశంలోని ముఖ్యమైన ప్రతి విశ్వవిద్యాలయాన్నీ, అలానే ఎఫ్‌టిఐఐ, ఐసిహెచ్‌ఆర్, ఐసిఎస్‌ఎస్‌ఆర్ తదితర విద్యాసంస్థలనూ ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారులకు అప్పచెప్పారు. వీరిలో చాలామందికి యిలాంటి సంస్థలను నడిపిన అనుభవం ఏమాత్రం లేదు. ఇలా నియమితమైన వారు అప్పటివరకు సంస్థల్లో వున్న అంతర్గత ప్రజాతంత్ర పనివిధానాన్ని నాశనం చేస్తున్నారు, పరిశోధనా పత్రాల్లోనూ, యితర విద్యా విషయాలలోనూ సంఘ్ అజెండాను రుద్దుతున్నారు. విశ్వవిద్యాలయాలలో గత నాలుగేళ్ళుగా యీ చర్యకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతూనే వున్నది, యీ తరహా జోక్యానికీ, విధానాలను రుద్దటానికీ వ్యతిరేకంగా యిక్కడి విద్యార్థులూ, వుపాధ్యాయులూ వీధులకు ఎక్కారు. డియు, జెఎన్‌యు, హెచ్‌సియు, అలహాబాద్ విశ్వవిద్యాలయము, ఎఫ్‌టిఎల్‌ఎల్ తదితర చోట్ల ఈ రకమయిన పోరాటాలు జరిగాయి.

***

# సమాఖ్య స్ఫూర్తికే విఘాతం

ఆర్థిక వనరుల సమీకరణను లబ్దిదారులకు సమీపంగా వుండే ప్రభుత్వ శ్రేణి స్వీకరించాలి, వనరుల సమీకరణను పన్ను చెల్లింపుదారులకు దూరంగా వుండే ప్రభుత్వ శ్రేణి చేపట్టాలి. ఈ కారణంగానే సమాఖ్యలు ఉన్న దేశాలన్నింటిలోనూ పన్నులు వేసే అధికారం కేంద్రానికి ఉంటే, ఖర్చులభారం రాష్ట్రాలదవుతుంది. ఈ అసమానతను తొలగించడానికి కేంద్రంలో రాష్ట్రాల వనరుల పంపిణీ నిమిత్తం ఒక వ్యవస్థ ఉంటుంది . భారత దేశంలో ఈ ఆర్థిక అసమానతను తొలగించడానికి యూనియన్ ఫైనాన్స్ కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 ప్రకారం నియమించబడింది. ఇది ఐదేళ్లకోసారి కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపకం ఎలాగుండాలి, రాష్ట్రాల మధ్యన జరిగే సమాంతర పంపకాలు ఎలాగుండాలి అన్నది సూచిస్తుంది. అంటే కేంద్రం నుండి వచ్చే నిధులు కేంద్రం దయాదాక్షిణ్యాలు కావు. రాష్ట్రాల హక్కులు. అయితే ఫైనాన్స్ కమిషన్ వేయడం గాని అది ఏ అంశాలను పరిశీలించాలన్నదిగాని సూచించే అధికారం మాత్రం కేంద్రానిదే. ఇదే సమాఖ్య స్ఫూర్తికి ఉన్నది .

## రాష్ట్రాల ఆర్థిక వనరులలో చొరబాటు

1990ల నుండిబడ్జట్‌లోటు లాంటి ఉదారవాద లక్ష్యాలను చేరుకునే అవసరమయిన విధానాలను అమలు చేసేందుకు, వాటిని భయపెట్టో, బుజ్జగించో దారిలో పెట్టుకునేందుకు ఆర్థిక సంఘం ఒక సాధనంగా మారింది. ఒక దృఢమయిన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకునేందుకు వీలుగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 280(2)(సి)ని చేర్చడం జరిగింది. భారతదేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ కోసం అంటే పురాణాలను చరిత్రగా మలచడమనే ఆర్‌ఎస్‌ఎస్ మనసుకు నచ్చిన పనిని ప్రభుత్వం చేసి పెడుతున్నది. కాని ద్రవ్య బాధ్యత (Piscal Respasiblity) బడ్జెట్ యీజం మాన్యం చట్టాలు, రెవెన్యూలోటు సున్నాగాను, ద్రవ్యలోటు రాష్ట్రస్థూల ఉత్పత్తి మధ్య నిష్పత్తి

3% మించకుండా ఉండేట్టు చూడడానికి, 11వ ఆర్థిక సంఘం నుంచి ప్రతిసంఘం గ్రాంటులను విడుదల చేయడాన్ని రుణ ఉపశమన ప్యాకేజీలు అమలు చేయడంలో అనుసంధానం చేస్తున్నది. 15వ ఆర్థిక సంఘం ఏఏ విషయాలపై సిఫారసులను చేయాలని సూచించబడిందో పరిశీలిస్తే మనకు ఉన్న కాస్త అనుమానాలు తీరిపోతాయి. రుణం–రాష్ట్రంలో స్థూల ఉత్పత్తి నిష్పత్తి 60%నికి పరిమితమవ్వాలి (40% కేంద్రం + 20% రాష్ట్రం)లోటు లక్ష్యంగా ఉండనే కూడదు. అందువలన ద్రవ్యలోటు – రాష్ట్రంలోని స్థూల ఉత్పత్తి నిష్పత్తి 2002 కల్లా కేంద్రానికి సంబంధించి 2.5%నికి కుదించబడాలి. రాష్ట్రాలు 1.7% పరిమితమవ్వాలి; ఇది 2017 FRBMA సమీక్షా కమిటీ సిఫారసు కేంద్ర రాష్ట్ర వనరులు ఏంతో ఎక్కువ పెరిగితేగాని(ఇది ఇప్పుడిప్పుడే జరిగే పనికాదు) ఖర్చులను తగ్గించుకోక తప్పదు అన్నమాట.

దీనిని బట్టి 15 ఆర్థిక సంఘం సిఫారసులు రాష్ట్రాల ఆర్థిక వనరులను ఉపయోగించుకునే స్వేచ్ఛను హరించడానికి ఒక ఆయుధంగా ఉపయోగపడుతున్నాయని అనుకోవలసి ఉంటుంది.

రాష్ట్రాల వనరులను ఇంకాస్త కుంటుపరచడానికి ఆర్థిక సంఘం, రాష్ట్రాలు అసలు రెవిన్యూ లోటును కలిగి ఉండాలా లేదా అన్నది కూడా ఆర్థిక సంఘం సూచించాలని చెప్పడం జరిగింది. 14వ ఆర్థిక సంఘం వరకు, ఆర్టికల్ 275 గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌ని, పన్నులను మినహాయించిన తరువాత (సహాయం కొరకు చేసే గ్రాంట్లు) ప్రణాళికేతర రెవిన్యూ లోటు (ఎన్.పి.ఆర్.డి)గా పిలుస్తుండేవారు. ఇది కేంద్ర పంపకాలలోను, రాష్ట్ర ఏకీకృత నిధి సమకూర్చడంలోనూ ప్రముఖ పాత్ర వహించేది. 14వ ఆర్థిక సంఘం రెవిన్యూ లోటు గ్రాంట్లు కేటాయించడానికి ప్రణాళిక ప్రణాళికేతర రెవిన్యూ ఖర్చులను పరిగణన లోనికి తీసుకుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అప్పటికప్పుడు చెల్లింపుల భారం పడితే 1.పే కమిషన్ వలన గాని 2. జి ఎస్ టి అమలు వలన గాని 3. సామాజిక ఆర్థిక రంగాల పై ఖర్చులు పెట్టవలసి వస్తే , 4 ఉడాయి బాండ్లపై వడ్డీ చెల్లించవలసి వస్తే, ఈ సూచనల వలన రాష్ట్రాలు తీవ్రభారం మోయవలసి వస్తుంది .

టర్మ్స్ అఫ్ రిఫరెన్స్ 7 (iii)లో "ప్రజాదరణ పథకాలపై నియంత్రణ" ఉన్నది. ఇది అస్పష్టమయినది; విస్తృతంగా అన్వయించగలది. దీనితో ఆర్థిక సంఘం, ప్రజలకు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి ప్రజాతంత్రంగా ఎన్నికయిన ప్రభుత్వ అధికారాన్ని అణచివేయగలదు. సంక్షేమ పెన్షన్ నుంచి ఆహార సబ్సిడీ వరకు దేనినయినా దాడికి ఉపయోగించవచ్చు. ఇది ప్రజాతంత్ర విధానానికి గొడ్డలి పెట్టు

## రాష్ట్రాల మధ్య విభేదాలు  మరింత ఉధృతం

మరో ఆందోళన కలిగించే అంశం వసూలు చేసిన పన్నులు కేటాయించడానికి ఇదివరకులాగా 1971 జనాభాను ప్రాతిపదికగా తీసుకోకపోవడం. జనాభాను తగ్గించుకుని, ఆరోగ్య సూచీలను చేరుకున్న రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఆ నష్టం పై 2011 జనాభాకు ఇచ్చిన వెయిటేజీ  నిష్పత్తికి అనుగుణంగా ఉంటుంది. 1971 జనాభాను పరిగణలోకి తీసుకున్నప్పుడు, 2011 జనాభాను పరిగణలోకి తీసుకున్నప్పుడు పొందే నిధులలోని తేడాను గనక చూసినట్టయితే దక్షణాది రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోయినట్టు తెలుస్తుంది. వీటితో పాటు గోవా, ఒరిస్సా, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్ కూడా నష్టపోతాయి.

జాతీయ జనాభాలో కర్ణాటక జనాభా 0.25% తగ్గింది. కేరళ లాంటి రాష్ట్రాలు కేవలం తరుగుతున్న జనాభాను మాత్రమే పూడ్చుకో గలుగుతున్నది; అందువలన యువశక్తి వలన పొంద గలిగిన లాభాలను పొందలేక పోతున్నది. ఈ అభివృద్ధిని సాధించడానికి వారు ఏంతో వ్యయ ప్రయాసలకు ఓర్చుకున్నారన్న సంగతి గుర్తించాలి. ఇప్పుడిక రెవిన్యూ లోటు రాష్ట్రాల భారాన్ని కూడా మోయవలసి వస్తున్నది. ఈ నష్టాన్ని పన్నులను పంచే క్రమంలో పరిగణించ వలసి ఉంటున్నది.

15వ ఆర్థిక సంఘం ఎంతో  చైతన్యంతో చేసిన మానవ అభివృద్ధి  విజయాలను నిరుత్సాహ పరుస్తున్నది.

## టర్మ్స్ ఆఫ్ రెఫెరెన్సులోనే సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధ ధోరణులు

ఆర్థిక సంఘం ఒక పర్యవేక్షక పాత్రను నిర్వహించాలని రాజ్యాంగంలో రూపొందించబడలేదు. ఆర్థిక సంఘం ఒక నిరంతరం కొనసాగే వ్యవస్థ కాదు. అందువలన అది సూచించిన ఏ విధానమయినా కేంద్రం అధికారుల ఆధ్వర్యంలో రాష్ట్రాలను పరిశీలించవలసి ఉంటుంది.

టర్మ్స్ ఆఫ్ రెఫెరెన్సు (విధానపర సూచనలు ) 6 (ఇవ్) సమాఖ్య నిర్మాణానినే సవాలు చేస్తుంది. అది "భారత్ ప్రభుత్వం 14 వ ఆర్థిక సంఘం సిఫాసుల కనుగుణంగా అత్యధిక పన్నులను పంపకాలు చేసిన ఆర్థిక పరిస్థితిలో, కొత్త భారతదేశం –2022 తో సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, దాని ప్రభావము  భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది"ని ఉంది. సహకార సమాఖ్య చట్రంలోస్థానిక సంస్థలు, రాష్ట్రాలు వీటి వలన ప్రయోజనాలు పొందే ప్రజలకు దగ్గరగా ఉంటున్నందువలన కొంత ఇచ్చిపుచ్చుకునే ధోరణి కలిగి ఉండాలి. అందువలన నిధులు స్థానిక సంస్థలకు రాష్ట్రాలకు ఇవ్వవలసి వస్తున్నందుకు కేంద్రం

6 నిబంధనలో లాగ భయపడవలసిన అవసరం లేకపోగా, నిధులు మరింత ప్రయోజనప్రదంగా ఉపయోగ పడతాయని అనుకోవాలి. నిజానికి కేంద్రమే తన వనరుల నుండి రాష్ట్రాలకు ప్రతి పనికి గ్రాంట్స్‌గా ఇచ్చే బదులు గణించదగ్గ ఫలితాలు వచ్చే విధంగా రాష్ట్రాలకు నిధులు ఇవ్వడం ఉత్తమం. టి ఓ ఆర్ లో  సూచించినవిధంగా అమలు జరిగితే,సహకార సమాఖ్య అన్న మాటే ఆవిరయిపోయినట్టే  15 వ ఆర్థిక సంఘం సిఫారసులు అమలు కాకుండా ఉండాలంటే, రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకోవాలంటే  ఈ సమస్యలపై ఖచ్చితమైన పంథాను అవలంభించ వలసినదే.

***

# కల్లోల కాశ్మీరం - మోడీ విధానం

మోడీ నేతృత్వంలోని బిజెపి-ఆరెస్సెస్ ప్రభుత్వాల ఘోర వైఫల్యానికి కాశ్మీర్ పరిస్థితి అద్దం పడుతున్నది. ఇక్కడున్న క్లిష్ట సమస్య ఏమంటే, మోడీ ప్రభుత్వం కాశ్మీర్ వ్యవహారాన్ని కేవలం భద్రత అనే ఒకేఒక్క కోణం నుంచి మాత్రమే చూస్తున్నదిగాని, దీనిని రాజకీయ సమస్యగా భావించి ప్రజలలోని వివిధ తరగతులను కలుపుకు పోవటం లేదు. కాశ్మీర్ వ్యవహారంలో సైనిక, రక్షణ బలగాలను వినియోగించటాన్ని ఒకేఒక్క 'మార్గంగా' భావించటం వలన వినాశకర పరిస్థితి చోటుచేసుకున్నది. నిజానికి గత నాలుగు సంవత్సరాలలో మోడీ ప్రభుత్వ విధానాలు, కాశ్మీర్‌లో అశాంతి, హింసాకాండలను సజీవంగా వుంచాలని భావిస్తున్న పాకిస్తాన్‌కే సహాకరించాయి.

ప్రధాన మంత్రి స్వయంగా చెప్పుకుంటున్నట్లు వుగ్రవాద దాడులు, రక్షణ దళాల మరణాలు ఎంతమాత్రం తగ్గకపోగా మరింతగా పెరిగాయి.

**జమ్ము-కాశ్మీర్‌లో మరణాలు: యుపిఎ చివరి నాలుగేళ్ళు-నాలుగేళ్ళ మోడీ పాలనకు పోలిక**

| | | పౌరులు | భద్రతా దళాలు | ఉగ్రవాదులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| **యుపిఎ** | 2010జూన్-2014మే | 98 | 154 | 492 | **744** |
| **మోడీ ప్రభుత్వం** | 2014జూన్-2018మే | 148 | 279 | 642 | **1069** |
| **పెరుగుదలశాతం** | | **51** | **81** | **30** | **44** |

**ఆధారం:ఐఐసిఎం**

ఆ విధంగా మోడీ ప్రభుత్వ విధానాలు వుగ్రవాద దాడులను తగ్గించటంలో విఫలమవటమేకాక, వాస్తవంలో హింసను పెంచాయి.

రెండవ విషయమేమంటే, యీ విధానాల వలన కాశ్మీర్ ప్రజలను మున్నెన్నడూ లేనంత గాఢంగా పరాయీకరణ చెందారు. ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలన్న పిలుపును, బెదిరింపులనూ లెక్కచేయకుండా జమ్ము-కాశ్మీర్ ప్రజలు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో పాల్గొన్నప్పటికీ, దీనిని ఆధారంగా చేసుకుని నిర్మాణాత్మక చర్యలతో వారి విశ్వాసాన్ని మోడీ ప్రభుత్వం పొందలేక పోయింది. తద్విరుద్ధంగా యీ అవకాశాన్ని పోగొట్టుకున్నది.

2016 జూలైలో హిజ్‌బుల్ తీవ్రవాది బుర్హాన్‌వనీని రక్షక దళాలు చంపివేసినపుడు పెద్దయెత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. రక్షక దళాలు దీనిని కిరాతకంగా అణచివేశాయి; ఢిల్లీనుంచి వచ్చిన వుత్తర్వుల మేరకు, తనకు విశ్వసనీయమైన పిడిపి ప్రభుత్వం దీనిని అణచివేసింది. భద్రతా దళాల కాల్పులవల్ల దాదాపు 6000 మంది గాయపడ్డారు. పెల్లెట్‌గన్‌ల కారణంగా సుమారుగా 500 మందికి కళ్ళకు గాయాలయ్యాయి; వీరిలో చాలామందికి అంధత్వం వచ్చే ప్రమాదం కూడా ఏర్పడింది. రెండేళ్ళ కాలంలో వుగ్రవాదులనేపేర వందల మందిని అరెస్టు చేశారు. ఇటీవల మాత్రమే వారు కేవలం 'రాళ్ళు విసిరారని' చెప్పి విడుదల చేశారు.

మూడవది, రాష్ట్రంలోని పిడిపి-బిజెపి ప్రభుత్వం చేసిందల్లా జమ్మూ-కాశ్మీర్‌ల మధ్య మత ప్రాతిపదికన విభజించడమే. కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని తొలగించాలన్న తన అజెండాను బిజెపి విడిచి పెట్టలేదు. ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలంటూ ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ బహిరంగంగానే పిలుపు యిచ్చాడు. శాశ్వత నివాసుల హక్కును కాపాడే రాజ్యాంగంలోని 35(ఏ)ను సవాల్ చేసేటందుకు 2017లో బిజెపి ప్రోత్సహించింది. 35(ఏ) అధికరణాన్ని సవరించమనటం అంటే, రాజ్యాంగం కల్పించిన స్థిరనివాసుల హక్కులను తొలగించటంగానే కాశ్మీర్ ప్రజలు పరిగణిస్తున్నారు. ఇదే సమయంలో రెండు ప్రాంతాలుగా వున్న జమ్ము, కాశ్మీర్‌లలో నిరంతరం మత ప్రాతిపదికన ప్రజలను విడగొట్టేందుకు సంఘ్‌పరివార్ ప్రయత్నిస్తున్నది. ఇది కాశ్మీర్ లోయలో ముస్లిము మతఛాందస వాదుల బలం బాగా పెరగడానికి దోహదపడింది.

ఈ పరిణామం కాశ్మీరియత్ భావనను దెబ్బతీస్తున్నది. కాశ్మీరీలోయ నుంచి బలవంతంగా గెంటివేయబడిన కాశ్మీరీ పండితుల పునరాగమనాన్ని యిలాంటి వాతావరణం తీవ్రంగా దెబ్బతీస్తుంది.

సంఘపరివార్ ద్వారా మతం రంగు పులుముకున్న రాజకీయాల స్వరూపం

జమ్మూలోని కటువాలో మైనర్ బాలికపై సాగించిన అత్యాచారం బహిర్గతం చేస్తున్నది. ఛార్జిషీట్ ప్రకారం మనకు తెలుస్తున్నది. ఈ బాలిక ముస్లిము కావటం వల్లనే అత్యాచారులు ఆమెను ఎంపిక చేసుకున్నారు, అన్ని అలానే, అత్యాచారం చేసిన వాడు హిందువు అయినందున రాష్ట్ర బిజెపికి చెందిన అగ్ర నాయకులు అతగాడిని బలపరుస్తున్నారు. తన మతతత్వ ఎజెండాను అమలు చేసేందుకు అత్యాచారాన్ని ఒక సాధనంగా ఉపయోగించడంకన్నా హేయమయినది ఇంకొకటి ఉండదు.

నాల్గవది, కాశ్మీర్ మినహా మిగిలిన దేశమంతటా తమ మతతత్వపు అజెండాను ముందుకు తీసుకు వెళ్ళేందుకై కాశ్మీరీయులందరినీ (ముస్లింలను) వుగ్రవాదులుగా బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు ముద్ర వేస్తున్నాయి. ఈ పరిణామం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అణచివేతను వ్యతిరేకిస్తున్న వారు జాతి వ్యతిరేకులుగా ఆ విధంగా కాశ్మీర్ యుద్ధోన్మాదానికి కపట దేశభక్తికి పనిముట్టుగా మారింది, ముద్రవేయ బడుతున్నారు. అటు భారతదేశ ప్రయోజనాలకుగానీ, ఇటు లేదా జమ్ము–కాశ్మీర్ ప్రజల ప్రయోజనాలకుగానీ వుపయోగ పడకుండా పోతుంది. అన్ని తరగతుల ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపేటందుకు కేంద్ర ప్రభుత్వం తిరస్కరించటానికి యిదొక కారణం.

కాశ్మీర్‌కు వెళ్ళిన పార్లమెంటరీ పార్టీ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ యిచ్చిన హామీకి కూడా యిది విరుద్ధం. రెండేళ్ళ తరువాత ఆలస్యంగానైనా కేంద్రం ప్రత్యేక ప్రాతినిధ్య సంఘాన్ని ఏర్పాటు చేసి. మాజీ గూఢచారి అధికారిని యీ సంభాషణలు నడపడానికి నియమించింది. ఏదియేమైనప్పటికీ, నిర్దిష్టమైన ఆదేశాలు లేకపోవడంలో యిది నిష్ఫలంంగా మిగిలి పోయింది.

ఈ ప్రతిష్టంభన వలన కూడా ముఖ్యంగా నష్టపోయింది. శ్రామిక జనులు, కాల్పులను ఎదుర్కొంటున్న జవానులు దిన సరికూలీలు, చిరు వ్యాపారులు, ఆటో రిక్షావాలా, శ్రమజీవులూ తమ జీవనాధారాలను పోగొట్టుకున్నారు, యీ ఒడుదుడుకుల్లో బతకటమే కష్టమై పోయింది. నిరంతరంగా సాగుతున్న యీ హింసాకాండ పర్యాటకాన్ని దెబ్బతీసింది, వుద్యోగాలు, ఆదాయాలు దెబ్బతిన్నాయి. అక్కడ ప్రభుత్వం గుర్తించిన 55 పర్యాటక కేంద్రాలలో 10 లేక 12 కేంద్రాలు తప్పక చూడాలని పర్యాటకులు కలలుగనేవి. కాని అవి ప్రభుత్వ పెట్టుబడులుగానీ, మౌలిక సదుపాయాలుగానీ లేక కునారిల్లుతున్నాయి.

ఉద్యోగావకాశాలు లేక పోవడంతో యువకులు నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాడవం చుస్తున్నది. దొరికిన


ఉద్యోగాలు కూడా అర్హతలకు తగినవికావు. ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థ కేంద్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం నిరుద్యోగం 38.8 (2016–17) శాతానికి చేరింది. వివిధ విద్యాసంస్థల నివేదికలను అనుసరించి 80 లక్షలమంది విద్యాధిక యువకులు నిరుద్యోగులుగా వున్నారు.

సామాజిక పెన్షన్లు సకాలంలో యివ్వటం లేదు, వుద్యోగులకు వేతనాలను యివ్వటంలో సైతం జాప్యం జరుగుతున్నది. ఉపాధ్యాయులు, పథక నిర్వాహకులు, తాత్కాలిక వుద్యోగులు, కాంట్రాక్టు వుద్యోగులు తరచుగా ఆగిపోయిన తమ వేతనాలను డిమాండు చేస్తూ వీధుల్లోకి వస్తున్నారు. శాసన సభలో హామీ యిచ్చినప్పటికీ రోజువారీ కార్మికుల, శ్రమజీవుల వేతనాలను క్రమబద్ధీకరించక పోవటమేకాక, సకాలంలో కూడా యివ్వటం లేదు. పురాతన కాలం నుంచీ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చేతి వృత్తులు కళ తప్పుతున్నాయి. కళాకారులు దౌర్భాగ్య జీవితాన్ని గడుపుతూ, ప్రభుత్వం నుంచి సామాజిక భద్రతను పొందలేక పోతున్నారు. భారతదేశం మొత్తంమీద అంగన్‌వాడీ వుద్యోగులకు ఇక్కడ అతి తక్కువ వేతనాలు వస్తున్నాయేమో! అంగన్‌వాడీ వుద్యోగులకు రూ. 3600లు వస్తుండగా, సహాయకులకు రూ. 1800లు వస్తున్నాయి.

విద్యార్థుల చేతుల్లో తుపాకులకు బదులుగా కలాలు వుండాలని ప్రధాన మంత్రి చెప్తున్నప్పటికీ, నిజానికి హింసాకాండ కారణంగా పాఠశాలలు, కళాశాలలు పదేపదే మూతపడుతూనే ఉన్నాయి.

జమ్ము–కాశ్మీర్‌లో ప్రధాన వనరుగా వున్న వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో వున్నది. ప్రభుత్వం ప్రకటించిన వివిధ వ్యవసాయ పథకాలు అమలు కావటం లేదు. మౌలిక సదుపాయాల పరిస్థితి దారుణంగా వున్నది. చేతి కొచ్చిన పంటను దాచుకునేందుకు గాని, అలానే మార్కెటింగ్‌కి గాని ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించ లేదు. కచ్చితమైన గిట్టుబాటు ధర లేక రైతులు సంక్షోభంలో కూరుకు పోతున్నారు. ప్రధాన ఆదాయ వనరుగా వున్న కుంకుమ పువ్వు పంటకు ప్రభుత్వం నుంచి కొద్దిపాటి సహాయం మాత్రమే లభిస్తున్నది, ధరకూడా చాలా తక్కువగా వుంటున్నది. కూరగాయల సాగు కూడా సజావుగా లేదు. పెట్టుబడులు ఎక్కువ కావటంతోపాటు, వుత్పత్తులకు అతి తక్కువ ధర లభిస్తుండటంతో రైతులు నిరాశలో మునిగి పోయారు. రాష్ట్ర రైతులకు రుణాలను మాఫీచేసే సూచనలు లేవు.

మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉదాహరణకు విద్యుత్ సరఫరా విషయాన్నే తీసుకోండి. జమ్ము–కాశ్మీర్ రాష్ట్రానికి 3000 మెగావాట్లు కావాలి. కాని, 2200 మెగావాట్లు మాత్రమే అందుతున్నది, అంటే, 800 మెగావాట్ల విద్యుత్ కొరత (26 శాతం) వున్నది. ప్రధానంగా పంపిణీ, సరఫరాల్లో ఏర్పడిన లోపాల కారణంగా సంభవిస్తున్న విద్యుత్




తగ్గుదలను అటు గ్రామీణ, యిటు పట్టణ ప్రాంతాలలో విద్యుత్ కోత ద్వారా పూడుస్తున్నారు. విద్యుత్ సరఫరాలో తరచుగా కోత విధించటం సర్వసాధారణమైంది. ఇటీవలనే కృష్ణగంగ హెచ్ఇపీని ప్రధాని ప్రారంభించారు. అయితే రాష్ట్రానికి పూర్తి లబ్ధి చేకూరలేదు. దీనికి 300 మెగావాట్ల వుత్పత్తి సామర్థ్యం వున్నది, కాని రాష్ట్రానికి 12 శాతం మాత్రమే ఉంచిన విద్యుత్ లభిస్తున్నది, స్థానిక ప్రాంత అభివృద్ధి కోసం 1 మెగావాట్‌ను వుపయోగిస్తారు. అయితే, రాష్ట్రం తన వాటాను 40శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నది.

దాదాపుగా 900 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు విద్యుత్ వుత్పత్తి కేంద్రాలను, అంటే, సలాల్, యురి హెచ్ఇపీలను రాష్ట్రానికి తిరిగి అప్పచెప్పాలని సి. రంగరాజన్ కమిటీ సలహాయిచ్చింది. కాని ప్రభుత్వం దీనిని అమలు చేయటానికి నిరాకరించింది, ఆ నివేదిక బూజుపట్టి పోయింది. మరోవైపున నిధుల కొరతతో వున్న రాష్ట్రం 2014-17 మధ్య విద్యుత్ కొనుగోలు కోసం రూ.16,000 కోట్లను వెచ్చించవలసి వచ్చింది. పదేపదే హామీలు యిచ్చినప్పటికీ రాష్ట్రం ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను కేంద్రం పట్టించు కోవటం లేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వంపట్ల కేంద్రం యొక్క వివక్షతా పూరిత వైఖరికి యిదే నిదర్శనం.

కాశ్మీరీయుల ప్రజాతంత్ర హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ(ఎం) భారత యూనియన్‌లో భాగంగా వున్న జమ్ము-కాశ్మీర్‌ను భారత రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రంగానే గుర్తిస్తున్నది. అణచివేత చర్యలను ఆపివేయాలి. రాజకీయంగా వున్న వివిధ తరగతుల వారితో చర్చలు జరపాలి. సరిహద్దు తీవ్రవాదుల చొరబాట్లను గట్టిగా వ్యతిరేకిస్తూనే, దీనితోపాటే కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం పాకిస్తాన్‌తో చర్చలు జరపాలి. 370వ అధికరణ ఏ ఉద్దేశంలో రాజ్యాంగంలో పొందు పరచబడిందో, దానిని పునరుద్ధరించాలి; జమ్మూ, కాశ్మీర్‌లోయ, లడక్‌లకు ప్రాంతీయ స్వయం ప్రతిపత్తిని అమలు చేయాలి. ఇదే సమయంలో రైతుల, శ్రామికుల, సాధారణ పౌరుల డిమాండ్లను నెరవేర్చటం కోసం తక్షణ చర్యలు చేపట్టాలి.

***

# అమెరికాకు గులాంగిరి

గత నాలుగేళ్ళుగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం అమెరికాకు అనుకూలంగా వుంటున్నది, రానురాను అమెరికాకు గులాంగా మారుతున్నది. పొరుగున వున్న పాకిస్తాన్‌తో సంబంధాలు దిగజారాయి. ఇతరంగా వున్న పొరుగు దేశాలతో కూడా సజావైన సంబంధాలు లేవు.

మోడీ ప్రభుత్వం బుకాయింపులను, బడాయిలను ప్రదర్శిస్తు మొదటి కేంద్రంగా చేసుకునే కార్యక్రమాలను రూపొందిస్తున్నది; అప్పుడప్పుడూ ప్రపంచదేశాలకు పసలేని సౌహార్ధ సంకేతాలను పంపిస్తున్నది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, దాని రాయబారులూ విదేశాంగ విధానానికి దూరంగా వుంచబడ్డారు. అంతకంతకూ భారతీయ విదేశాంగ విధానాన్ని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నడుపుతున్నట్లుగా వున్నది. కేవలం రక్షణ కోణం నుండే చూడబడుతున్నది.

ఇటీవలి సంవత్సరాలలో స్వతంత్ర భారత విదేశాంగ విధానానికి రెండు దెబ్బలు తగిలినట్లుగా కన్పిస్తున్నది. ఒకటేమో సైనిక ఒప్పందాలు, విన్యాసాల ద్వారా అమెరికాకు సన్నిహితంగా మెలగటం. రెండవది, ఇజ్రాయెల్‌ను సైద్ధాంతిక రష్యాతో వున్న చారిత్రక సంబంధాలు బలహీన పరుచుకుంది. స్పష్టమైన సంకేతాలు ఇవ్వడం ట్రంప్ ఇరాన్‌తో చేసుకున్న అణుఒప్పందం నుండి విరమించుకుంటూటే ప్రేక్షక పాత్ర వహించింది.

## అమెరికాతో ఒప్పందాలు

మోడీ ప్రభుత్వం రవాణా సేవల ఒప్పందం **ఎల్ఇఎంఓఏ**, సిగ్నల్ ఒప్పందం **సిఐఎస్ఎంఓఏ** అనే రెండు అతిపెద్ద రక్షణ ఒప్పందాలపై సంతకాలు చేసిన అనంతరం యిప్పుడు మరో రెండు ఒప్పందాలపై సంతకాలు చేసే ఆలోచనలో ఉన్నది. అవి **కమ్యూనికేషన్స్ కంపాటబిలిటీ అండ్ సెక్యూరిటీ అరేంజ్‌మెంట్ (సిఓఎంసిఏఎస్ఏ),**

కాగా, **బేసిక్ ఎక్స్చేంజ్ అండ్ కోఆపరేషన్ అగ్రిమెంట్ ఫర్ జియో-స్పేషియల్ కోఆపరేషన్ (బిఇసిఏ)**

**లెమోవా** అనేది లాజిస్టిక్ సర్వీస్ అగ్రిమెంట్‌కు మరోపేరు మినహా మరేమీ కాదు. భారతదేశపు ఓడరేవులనూ, విమానాశ్రయాలనూ అమెరికన్ సైనిక దళాలకు అప్పచెప్పేందుకు **లెమోవా** అంగీకరిస్తున్నది. అంతేకాక వాటిపై పెత్తనాన్ని కూడా కల్పిస్తున్నది. భారతదేశం అమెరికన్ సిగ్నలింగ్ వ్యవస్థను వుపయోగించు కోవటానికి **సిసోమా** అనుమతి యిస్తున్నది, అయితే బదులుగా భారతదేశ సైనిక చర్యలను గ్రహించేటందుకు అమెరికాకు కూడా సౌలభ్యం సమకూరుతుంది. అని గత ఏడాదే సిపిఐ(ఎం) పేర్కొంది.

**కోమ్‌కోసా** ద్వారా అమెరికా కేవలం సైనిక చర్యలను గ్రహించటమే కాకుండా, భారతదేశ సైనిక దళాల అంతరంగిక సమాచారాన్నంతటినీ అదుపు చేస్తుంది. **బెకా** ద్వారా భారతదేశ లక్ష్యాలన్నిటినీ (క్షిపణులు, పిరంగులు, బాంబులు తదితరాలను) అమెరికన్ జియో స్పాటియల్ వుపగ్రహం ద్వారా ప్రయోగిస్తారు, అంటే భారతదేశాన్ని అమెరికాపై ఆధారపడేలా చేస్తున్నారన్నమాట. విషాదమేమంటే, మరో దేశపు వుపగ్రహాలపై ఆధారపడకుండా వుండేటందుకుగాను భారతదేశం యిప్పటికే ఎంతో వ్యయానికి ఓర్చి స్వంతంగా జియో వుపగ్రహాల ప్రయోగాన్ని చేపట్టింది, యిప్పటికే యిలాంటివి ఆరు వుపగ్రహాలు పనిచేస్తున్నాయి. ఈ దశలో తిరోగమన మార్గంపట్టి అమెరికా జియో వుపగ్రహాలపై ఆధారపడటంలో అర్థంలేదు.

ఈ రెండు ఒప్పందాల వలన (కోమ్‌కోసా, బెకా) భారతదేశపు అత్యాధునిక సైనిక సదుపాయాలన్నీ అమెరికా అదుపులోకి వెళ్తాయి. ఇంతకు ముందున్న యుపిఏ ప్రభుత్వంగానీ, దానికి ముందున్న మొట్టమొదటి ఎన్‌డిఏ ప్రభుత్వంగానీ యీ ఒప్పందాల జోలికి వెళ్ళలేదంటే కారణం యిదేనని చెప్పవచ్చు. భారతదేశం వినియోగించే అనేక రకాలైన హార్డ్‌వేర్ పరికరాలు రష్యావంటి చోట్ల నుంచి వస్తున్నాయి, వీటి ద్వారా అమెరికా సిగ్నలింగ్ వ్యవస్థ లక్ష్యాలను చేరుకునే పరికరాలు, రష్యాలో చొరబడే అవకాశాలుండడం వలన రష్యా ఈ ఒప్పందాలను హర్షించలేకపోవచ్చు; ఫలితంగా రక్షణ సంబంధాలు వివిధ దేశాల నుండి కొనుగోలు చేసే భారతదేశ విధానానికి దీర్ఘ కాలంలో భంగం వాటిల్లవచ్చు. దీనివల్ల ముమ్ముందు చేసే కొనుగోళ్ళన్నిటినీ నాటో దేశాల నుంచే కొనుగోలు చేయాల్సి వస్తుంది. **లెమోవా** నుంచి **బెకా** వరకు వున్న అమెరికన్ రక్షణ ఒప్పందాల అంతరార్థం యిదేననటంలో సందేహం లేదు.

అమెరికా, జపాన్, భారతదేశంలు నిర్వహించే సైనిక విన్యాసాలు -వార్షిక మలబార్ విన్యాసాలు- జపాన్ సముద్రంలో ఒకినవా సమీపంలో ఫిలిప్పీన్స్‌కు దగ్గరగా

నిర్వహిస్తున్నారు. చైనాను నిరోధించే తన పథకంలోకి భారత్‌ను లాగటమే అమెరికా అసలు వుద్దేశం. ఇక్కడే యీ ఒప్పందాల (కోమ్‌కోసా, బెకా) అసలు ప్రాధాన్యత దాగివున్నది. భాగస్వాములుగా వున్న నౌకాదళాలన్నీ ఒకటిగా పనిచేస్తాయి. బహుశ అమెరికా నేతృత్వంలోనే.

గత పదేళ్ళ కాలంలో అమెరికా నుంచి భారతదేశం 1500 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను కొనుగోలు చేసింది. భారతదేశానికి చెందిన వ్యూహాత్మక, రాజకీయ, సామాజిక మౌలిక సదుపాయాల రంగంలో అమెరికాకు చెందిన 50 బృందాలు పనిచేస్తున్నాయి. సైనిక, రక్షణ రంగాలలో వుద్యోగ విరమణ చేసిన పలువురు భారతీయులకు అమెరికా మేధావి వర్గంలో ఆశ్రయం దొరుకుతున్నది.

## ఇజ్రాయెల్

ఇజ్రాయెల్‌తో మోడీ ప్రభుత్వ సంబంధాలు అంతకంతకూ బలపడ సాగాయి. ఇజ్రాయెల్ ఆయుధాలకు మనదేశం అతిపెద్ద ఖాతాదారుగా మారింది. 1895కు ముందే జినోయిజమ్‌ను స్థాపించిన థియోడర్ హెర్జ్‌కు గత ఇజ్రాయెల్ పర్యటనలో మోడీ వందనాన్ని ఆచరించాడు, పాలస్తీనియన్లనూ, దాని అరబ్ జనాలనూ తుడిచి పెట్టాలన్నదే యీ సిద్ధాంత సారం. ఇజ్రాయెల్‌పట్ల మోడీకున్న మక్కువ ఆరెస్సెస్ నుంచీ, దాని హిందూత్వ భావజాలం నుంచీ పుట్టుకు వచ్చిందనేది సుస్పష్టమే. ఆరకంగా యిది జినోయిజమ్‌కు దగ్గరదైనది. ఈ ఏడాది ఏప్రియల్–మే మాసాలలో పాలస్తీనియన్లు నిర్వహించిన ఆరు వారాల నిరసన ప్రదర్శనలపై ఇజ్రాయెల్ సైనికులు వందమందికి పైగా పొట్టన పెట్టుకున్నారు, మోడీ పర్యటన యీ ఘోరాన్ని కూడా ఆమోదించినట్లయింది.

దాదాపు దశాబ్దం క్రితమే తాము పొందిన భూములను, ఇళ్ళను వదులుకుని గాజాలోని సరిహద్దులకావల 20 లక్షలమంది పాలస్తీనియన్లు బందీలుగా వున్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో భారతదేశం ఇజ్రాయెల్, పాలస్తీనాలతో సంబంధాలను వదులుకోవచ్చుగాక. కాని అక్కడి ప్రజలను యథార్థ చరిత్రను తుడిచివేయలేరు. భౌగోళిక స్వరూపాన్నీ దాచిపెట్టలేరు. పాలస్తీనియన్లను తుడిచిపెట్టే కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ యిప్పటికీ కొనసాగిస్తున్నది, జెరూసలేంనూ, గాజాను ఆక్రమించు కోవటానికి ప్రయత్నాలు చేస్తున్నది. గాజా సరిహద్దులో నిరాయుధులైన నిరసనకారులను ఆటవికంగా చంపించిన జియోనిజంతో హిందూత్వకున్న సంబంధాల వల్లనే మోడీ ప్రభుత్వం మౌనాన్ని పాటించింది.

## ఇరుగు పొరుగు దేశాలు

మోడీ హయాంలో ఇరుగుపొరుగు దేశాలతో భారతదేశ సంబంధాలు

అదః పాతాళానికి దిగజారి పోయాయి. బెదిరింపులు, ఆర్థిక దిగ్బంధనాలు, మెరుపు దాడులు, వెంటాడటం లేదా కవ్వింపులుతో కూడిన మోడీ, బిజెపి విదేశాంగ విధానం ఎలాంటి ఫలితాలను యివ్వకపోగా ప్రతికూలతనే యిస్తుంది.

భారత్, పాకిస్తాన్‌ల అంతర్జాతీయ సరిహద్దు, కాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ నిరంతరం వుద్రిక్తతలతో సతమత మౌతున్నది. సరిహద్దు వెంబడి కాల్పులకు పౌరులే కాకుండా భద్రతా దళాలు కూడా బలవుతున్నాయి. గతంలో కాల్పులు లేకుండా వున్న అంతర్జాతీయ సరిహద్దులో సైతం యీనాడు కాల్పులు వినపడుతున్నాయి. దీనివల్ల పౌరులు గాయపడటమే కాకుండా ఆస్తి నష్టం జరుగుతున్నది. నేపాల్ ఆర్థిక దిగ్బంధనాన్ని మోడీ ప్రభుత్వం సమర్థించటంతో భారత్ పట్ల నేపాల్‌లో ఆగ్రహం చెలరేగుతున్నది. చిన్నచిన్న దేశాలు సైతం సైనిక లేదా ఆర్థిక బెదిరింపులకు భయపడటం లేదు. అంతకంతకూ ఎడం పెరుగుతుండటంతో యిరుగు పొరుగు దేశాలతో ప్రభుత్వం సంబంధాలను పెంచుకోవల్సి వస్తున్నది. చైనా, నేపాల్‌లలో యిటీవలి మోడీ పర్యటనలను యీ దృష్టినుంచే చూడాలి.

జాతీయ భద్రతా మండలి, ప్రధానమంత్రి కార్యాలయమూ విదేశాంగ శాఖకు తెలియచేయ కుండా చర్చలకు వెళ్ళడ మంటే తీవ్రమైన అంశాలకు సన్నద్ధం కావటం లేదనే అర్థం చేసుకోవాలి. విదేశీ నాయకులతో జరిపే తొందర పాటుతో చేసే తాత్కాలిక సమావేశాలు, అలానే కుహనా శిఖరాగ్ర సభలు ప్రసారమాధ్యమంలో ప్రచారానికి మాత్రమే పనికి వస్తాయి. దేశ రాజకీయాలలో మోడీ, బిజెపిలు పాకిస్తాన్ కార్డును ఎక్కువగా వుపయోగిస్తూ పాక్‌కు ఎడమవుతున్నాయి, అంతర్జాతీయంగా ఒకప్పుడు నిర్వహించిన బృహత్తర పాత్రను మరచిపోయింది. భద్రతా కోణం నుండే విదేశాంగ విధానాన్ని చూడడం వలన భారతదేశం తనదైన జియోస్ట్రాటజిక్ దార్శనికతా శక్తిని పోగొట్టుకున్నట్లుగా కన్పిస్తున్నది. ఒకప్పుడు అలీన దేశాలకు (నామ్), వర్ధమాన దేశాలకు నాయకునిగా వున్న భారతదేశం యీనాడు ప్రపంచ దేశాలలో తన ప్రాచుర్యాన్ని పోగొట్టుకున్నది.

***